చింతలపూడిలో 'జగనన్నకు చెబుదాం' వాయిదా

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 13న షెడ్యూల్ ప్రకారం జిల్లాస్థాయి అధికారులతో షెడ్యూల్ ప్రకారం చింతలపూడి మండలంలో నిర్వహించాల్సిన మండలస్థాయి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమం వాయిదా వేశామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

విద్యా దీవెన జమయ్యేదెప్పుడో..!

- బటన్ నొక్కి15 రోజులు గడిచినా ఖాతాల్లోకి రాని సొమ్ము
- ఫీజులు కట్టేందుకు తల్లిదండ్రులు నానావస్థలు
- రెండు జిల్లాల్లోనూ 63,847 మంది విద్యార్థులు
- ఇప్పటి వరకూ ఎంతమందికి జమైందో తెలియని అయోమయం
- ఇలాగైతే ఎలాగంటూ తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యార్థులకు అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన విద్యాదీవెన సొమ్ము విద్యార్థులకు సకాలంలో అందడం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాల ఒత్తిడితో ఫీజులు చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నానావస్థలు పడుతున్నారు. విద్యాదీవెన సొమ్ముకు సంబంధించి ఆగస్టు 28వ తేదీన సిఎం చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన సభలో బటన్ నొక్కారు. ఇది జరిగి 15 రోజులు గడిచినా ఇప్పటికీ విద్యా దీవెన సొమ్ము జమ కాకపోవడంతో తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. విద్యాదీవెన అందుకునే విద్యార్థులు ఏలూరు జిల్లాలో 31,859 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 31,188 మంది మొత్తం 63,867 మంది ఉన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికానికి సంబంధించిన విద్యాదీవెన సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. ఏలూరు జిల్లాలో రూ.25.37 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.25.53 కోట్లు మొత్తం రూ.50.90 కోట్లు సొమ్ము జమ కావాల్సి ఉంది. రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ సగం మంది విద్యార్థులకూ సొమ్ము జమ కాలేదని తెలుస్తోంది. ఎంతమందికి జమైందో కూడా తెలియని అయోమయం నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము సకాలంలో జమ కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయాలకు వెళ్లి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే జమవుతాయంటూ సచివాలయ ఉద్యోగులు సర్దిచెప్పి పంపిస్తున్న పరిస్థితి ఉంది. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన సొమ్ము ప్రభుత్వం నేరుగా కాలేజీలకు చెల్లించేది. దీంతో ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాల మధ్యే ఈ వ్యవహారం సాగేది. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు సంబంధించి విద్యాదీవెన పథకం తెచ్చింది. విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు సొమ్మును నాలుగు విడతలుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. మొదట్లో సిఎం బటన్ నొక్కిన ఒకటి, రెండు రోజుల్లో విద్యాదీవెన సొమ్ము విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి చేరేవి. తల్లిదండ్రులు వెంటనే కాలేజీలకు చెల్లించేవారు. గడిచిన ఏడాదిగా విద్యాదీవెన సొమ్ముకు సంబంధించిన సిఎం బటన్ నొక్కినా రోజులు, నెలలు తరబడి సొమ్ము జమ కావడం లేదు. విద్యాదీవెన సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది కాబట్టి వెంటనే చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. సొమ్ము జమ కాలేదని చెప్పినా విన్పించుకోవడం లేదు. తర్వాత జమవుతాయని, మీరు చెల్లించాలంటూ హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో సామాన్య కుటుంబాలు పిల్లల ఫీజు కోసం నానావస్థలు పడుతున్నారు. విద్యాదీవెన ఒక్కటే కాదు, వసతిదీవెన సొమ్ము పరిస్థితీ ఇదేవిధంగా మారింది. ఫీజు సొమ్ము సకాలంలో ప్రభుత్వం జమ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిందండ్రుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అమ్మఒడి సొమ్ము సైతం ఇదేవిధంగా జమ కాకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాదీవెన సొమ్ము ఎప్పటికి జమవుతుందో సరైన సమాధానం చెప్పేవారే లేకపోవడంతో తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విద్యాదీవెన సొమ్ము వెంటనే జమ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్, బ్యాంకు అధికారులు

అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల కోసం కొత్త పోర్టల్

కౌలురైతులకు విరివిగా రుణాలందించండి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు తెలుసుకోవడానికి ఉదగం పేరిట సెంట్రలైజ్డ్ వెబ్‌పోర్టల్‌ను ఆర్‌బిఐ ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం జరిగిన బ్యాంకర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2023-24 వార్షిక రుణప్రణాళికను, చైతన్య గ్రామీణ చైతన్య బ్యాంకు వార్షిక నివేదికను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఉదగం పేరిట ప్రారంభించిన ఈ పోర్టల్ ద్వారా అన్ క్లెయిమ్డ్ మొత్తాలను కావాలంటే తీసుకోవడం లేదా ఆయా ఖాతాలను పునరుద్ధరించుకోవడానికి వీలవుతుందని చెప్పారు. ఏదైనా బ్యాంకు ఖాతాలోని నగదు 10 ఏళ్లు, లేదా అంతకుమించి వాడుకలో లేకపోతే దానిని అన్ క్లెయిమ్డ్ డిపాజిట్‌గా పరిగణిస్తారన్నారు. అలా ఎవరూ క్లెయిమ్ చేయని డిపాజిట్లుగా ఆ సొమ్ము బ్యాంకుల్లోనే పేరుకుపోవడం జరుగుతుందన్నారు. అటువంటి ఖాతాల వివరాలను ఆర్బీఐ ప్రవేశపెట్టిన ఉదగం పోర్టల్ ద్వారా చూసుకోవచ్చన్నారు. పేరు, ఇతర వివరాలు ఇస్తే అది బ్యాంకు డేటా బేస్‌తో పోల్చుకుని వివరాలు చూపిస్తుందన్నారు. ప్రస్తుతానికి ఎస్‌బిఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ధనలక్ష్మీ బ్యాంకు, సౌత్ ఇండియన్ బ్యాంకు, డిఎస్‌బి బ్యాంకు ఇండియా లిమిటెడ్, సిటీ బ్యాంకు ఉన్నాయన్నారు. అక్టోబరు 15లోగా మిగిలిన బ్యాంకుల్లో అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు కూడా ఉదగం పోర్టల్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు.

కౌలు రైతులకు ఉదార స్వభావంతో రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని బ్యాంకర్లకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. రుణార్హత కార్డులున్న కౌలు రైతులకు బ్యాంకర్లు రుణాలు అందించిన తీరు అసంతృప్తిగా ఉందన్నారు. వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించకుండా కౌలు రైతులకు ఇతోధికంగా రుణాలు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని ఆయన స్పష్టం చేశారు. భూయజమాని రుణాలు తీసుకున్నారని సాకుకు స్వస్తి పలికి భూమిపై సాగు చేస్తున్న కౌలు రైతుకు రుణాలందించి సహకరించాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు కలిగిన కౌలు రైతుల చిరునామా, ఫోన్ నెంబరు తదితర సమాచారాన్ని అన్ని బ్యాంకర్ల కంట్రోలర్‌లకు పంపుతామని, అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఆయాబ్యాంకు మేనేజర్లకు అందించి రశీదు పొందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సిసిఆర్‌సి కార్డులు కలిగిన కౌలు రైతులకు పంటరుణాల మంజూరు, జగనన్నతోడు, పిఎం విశ్వకర్మ యోజన, పిఎంఇజిపి, జగనన్న పాలవెల్లువ కార్యక్రమానికి రుణాల మంజూరుపై ప్రతివారం ప్రగతిని అందించాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. ఈ నెల 17న ప్రారంభం కాబోతున్న పిఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలన్నారు. ఇటీవల కాలంలో స్పందనలో బ్యాంకు సిబ్బంది లేదా బ్యాంకింగ్ కరస్పాండెంట్ల మూలంగా మోసపోయామని ఫిర్యాదులు వస్తున్నాయని, ఇటువంటి వాటిని నిరోధించేందుకు బ్యాంకర్లు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. డిసిసి కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ 2023-24 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.16,260 కోట్లు కాగా వ్యవసాయానికి రూ.11,411 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రాధన్యేతర రంగాలకు రూ.1806 కోట్లు కేటాయించామన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డుల కింద 2207మంది రైతులకు రూ.15.44 కోట్లు అందించామన్నారు. సమావేశంలో డిసిసి కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి, రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డిఒ పూర్ణిమ, ఎల్‌డిఎం డి.నీలాద్రి, నాబార్డ్ డిడిఎం అనిల్‌కాంత్, పశు సంవర్ధకశాఖ జెడి జి.నెహ్రూబాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ పి.ఏసుదాసు, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, వివిధ బ్యాంకుల కంట్రోలర్‌లు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రిలే నిరాహార దీక్షలు

రిలే నిరాహార దీక్షలో టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నారా చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదలయ్యే వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని టిడిపి శ్రేణులకు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా టిడిపి కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టిడిపి విస్తత స్థాయి సమావేశాన్ని జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ అక్రమ అరెస్టులతో సాధించేదేమీ లేదని టిడిపి నాయకులు, కార్యకర్తలు, టిడిపి అభిమానులు ఏక కంఠంతో సిఎం జగన్, వైసిపి ప్రభుత్వంపై మండిపడ్డారు. సైకో జగన్ పోవాలి, సైకిల్ రావాలి అని నినాదాలతో జిల్లా టిడిపి కార్యాలయం మారుమోగింది. అనంతరం చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులు, అరెస్టుపై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అందులో భాగంగా మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో చంద్రబాబు నాయుడు విడుదల అయ్యే వరకు రిలే నిరహార దీక్షలు, రోడ్లపై వంటావార్పు తదితర నిరసన కార్యక్రమాలు రోజుకో విధంగా నిర్వహించాలని నిర్ణయించారు. టిడిపి సానుభూతి పరులందరూ వివిధ రూపాల్లో తమ నిరసన తెలియజేయాలని కోరారు. సోమవారం నిర్వహించిన బంద్‌కు మద్దతు తెలిపిన జనసైనికులకు, ఎంఆర్‌పిఎస్‌కు, కమ్యూనిస్టులకు, సహకరించిన వ్యాపార వర్గాలకు, విద్యాసంస్థలకు, ప్రజలకు, బ్యాంకు సిబ్బందికి, ప్రభుత్వ ఉద్యోగులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ అధ్యక్షులు కెఎస్.జవహర్, ఏలూరు పార్లమెంట్ మాజీ సభ్యులు మాగంటి వెంకటేశ్వరరావు, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, ముళ్లపూడి బాపిరాజు, ఏలూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంఛార్జిలు, బూత్ ఇంఛార్జిలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుపై నిరసన వ్యక్తం చేస్తూ స్థానిక టిడిపి శ్రేణులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మంగళవారం స్థానిక అశ్వారావుపేట రోడ్డు ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పట్టణ టిడిపి అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. టిడిపి సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్, మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి చెరుకూరి శ్రీధర్‌లు దీక్ష చేపట్టిన వారికి పూలమాలలు వేసి, దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు పరిమి సత్యనారాయణ రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చేస్తుందన్నారు. ప్రజల్లో చంద్రబాబు నాయుడుకి పెరుగుతున్న ఆదరణ చూసి, ఓర్వలేక నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు అధైర్య పడకుండా సమన్వయంతో శాంతియుత పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు తూటికుంట రాము, గుమ్మడి ప్రసాద్, షేక్ యాకోబ్, తోట కృపవరం, మున్సిపల్ కౌన్సెలర్ జ్యోతి, అంబేద్కర్, చిట్టిపోయిన రామలింగేశ్వరరావు, కుక్కల మాధవరావు, ముళ్లపూడి శ్రీనివాసు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం అన్యాయమని, ఆయన నిర్దోషిగా బయటకు వస్తారని టిడిపి నాయకులు రాజా తెలిపారు. మండలంలోని బత్తులవారి గూడెంలో మంగళవారం టిడిపి నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రహదారుల వెంబడి సిఎం డౌన్ డౌన్ అనే నినాదాలు చేసుకుంటూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు రాజా మాట్లాడుతూ రాబోయేది టిడిపినే అని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ఆయన తెలియజేశారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సచివాలయ సెక్రటరీ

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలో 26వ నెంబర్ సచివాలయంలో ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న మానుకొండ రాజకుమార్ ఇటీవల విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన కబడ్డీ, రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ రాజకుమార్‌కి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంచి పేరు కార్పొరేషన్ తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజకుమార్‌కు సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాజకుమార్‌ను అభినందిస్తున్న కమిషనర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

నిబంధనల మేరకు ఓటర్ల జాబితా తయారీ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించి ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 పూర్తిస్థాయిలో చేపట్టాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024పై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టి పూర్తిచేసిన నివేదికను వివరించారు. నిబంధనల ప్రకారం జాబితా తయారీకి చర్యలు చేపట్టామని తెలిపారు. సమావేశంలో ఆర్‌డిఒలు ఎస్‌కె.ఖాజావలి, ఝాన్సీరాణి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణమూర్తి, తహాశీల్దార్ సోమశేఖర్, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరింటెండెంట్ చల్లన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతిపై విస్తరణ అధికారుల నియామకం

ప్రజాశక్తి - ఏలూరు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు జిల్లాకు తొమ్మిది మంది విస్తరణ అధికారులను ఉద్యోగోన్నతిపై కేటాయించారు. వీరికి ఆయా ఖాళీగా ఉన్న మండలాలు కేటాయిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలానికి సిహెచ్.శేఖర్, చాట్రాయికి మురళీకృష్ణ, భీమడోలుకు సుందరి, కలిదిండికి రాజారావు, ముదినేపల్లికి లక్ష్మీనారాయణ, కామవరపుకోటకు మరిడయ్య, కుక్కునూరుకు శివనాగ నరసింహరావును కేటాయించారని తెలిపారు. ఇంకా ఇద్దరు విస్తరణ అధికారులు జిల్లాకు రిపోర్ట్ చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాలకు విస్తరణ అధికారులను ప్రభుత్వం భర్తీ చేసిందని, దీనివల్ల గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రగతి ఉంటుందని డిపిఒ చెప్పారు.

నియామక ఉత్తర్వులు అందిస్తున్న డిపిఒ

ముదినేపల్లి కార్యదర్శికి ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి

ముదినేపల్లి: ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శి టివి సారధికి ఇఒపిఆర్‌డిగా ఉద్యోగోన్నతి లభించింది. సారధి బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండల ఇఒపిఆర్‌డిగా నియమితులయ్యారు. సారధి సుదీర్ఘ కాలంగా మండలంలోని పలు పంచాయతీల్లో కార్యదర్శిగా విధులు నిర్వహించారు. కొన్నాళ్లుగా ఆయన ముదినేపల్లి ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డిగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. సారధి స్థానంలో ముదినేపల్లి ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శిగా చిరుగుకోట పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

మాట్లాడుతున్న సాబ్జీ

ఏలూరు టౌన్: విద్యార్థులు చక్కని క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. ఆయన మంగళవారం పరివర్తన్ వికలాంగుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సాబ్జీ విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో చక్కని సదుపాయాలు ఉన్నాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యాబోధన, భోజన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు, విద్యాబోధన, భోజన సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పరివర్తన్ వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరెడ్డి, పాఠశాల సిబ్బంది, డిడిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మహిళా ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజి పరిధిలో మహిళా ఎస్ఐల ప్రిలిమినరీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు శారీరక దారుఢ్య పరీక్షలను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించారు. అభ్యర్థినులకు ఎత్తు, 1600 మీటర్ల పరుగు పందెం, 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. మొత్తం 535 మంది అభ్యర్థులకు అడ్మిట్ కార్డ్‌లు ఇచ్చామని, 260 మంది మహిళా అభ్యర్థులకు మంగళవారం పరీక్షలు నిర్వహించామని డిఐజి జివిజి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా పురుషులు 4,581 మంది హాజరవ్వగా, 3,233 మంది అర్హత సాధించారని చెప్పారు. మహిళలు 1,177 మంది హాజరవ్వగా 607 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, జిల్లా ఎఎస్‌పి ఎంజెవి భాస్కరరావు, అధికారులు బిఎన్‌వి సాయి ఈశ్వరరావు, లతకుమారి, డాక్టర్ పోతుమూరి శ్రీనివాసు, డాక్టర్ శ్రీజ, ఎస్ఐలు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని పోస్టుకార్డు ఉద్యమం

పోస్ట్ కార్డులతో ప్రదర్శన చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు జీతాలు పెంచాలని కోరుతూ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్లు జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సొంగా సిద్దు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు మంగళవారం పోస్టు కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడుతూ వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నేషనల్ హెల్త్ మిషన్‌లో ఒక భాగమని తెలిపారు. మే నెలలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న ఉద్యోగస్తులందరికీ ప్రభుత్వం 22 శాతం జీతాలు పెంచి, గత ఐదు సంవత్సరాలుగా వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తుందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు జీతాలు పెంచకపోవడం బాధాకరమన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు 22 శాతం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 11వ తేదీ నుంచి పోస్ట్ కార్డు ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజనీ, ప్రభుత్వ సలహాదారు, చీఫ్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్‌కు పోస్ట్‌కార్డు రాసి నిరసన తెలియజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రాజ్ చిన్ని, ఎస్.విజయ్, ఇ.ప్రసన్న, జి.రాజ్యలక్ష్మి, టి.శారద, బి.నవ్య, బి.నాగబాబు, కె.అనూష, ఎన్.ప్రియాంక, ఎస్.జగదాంబ, రెడ్డి జాన్సీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధనప్రకాశ్

నిరుపేద పిల్లలను ఆదుకోవడం అభినందనీయం

ఆగిరిపల్లి: ఆహ్లాదకర వాతావరణంలో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద పిల్లలకు ఉచితంగా విద్య, వైద్య, వసతి సదుపాయాలు ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.చెల్లప్ప అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలోని హీల్ ప్యారడైజ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హీల్ ఛైర్మన్ ధనప్రకాశ్ మాట్లాడుతూ వేగే శ్రీనివాసరావు వారి ఆర్థిక సహాయంతో హీల్‌లో అలేఖ్య హీల్ అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్ఫలెన్సీ ప్రారంభించామన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ కోర్స్‌లో అడ్మిషన్స్ జరుగుచున్నవని, ఈ కోర్సులో అవకాశం పొందడానికి అనాథ పిల్లలు, తల్లి లేదా తండ్రి లేని పిల్లలు, ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కనీసం ఇంటర్‌మీడియట్(ఎంపిసి/ఎంఇసి), డిగ్రీ(కంప్యూటర్స్), ఇంజనీరింగ్(కంప్యూటర్స్)లో 70-75 శాతంతో ఉత్తీర్ణులై వుండాలన్నారు. వివరాలకు 9100024435, 9100024438 నెంబర్లను సప్రదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిఇఒ కె.అజయ్‌కుమార్, కార్యదర్శి టి.లక్ష్మి, ఐటి హెడ్ కరుణ బాబులు పాల్గొన్నారు.

టిడిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలి

కైకలూరు : రానున్న ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా నేటి నుంచే పని చేయాల్సిన అవసరం ఉందని తెలుగు యువత జిల్లా కార్యదర్శి పూల రామచంద్రరావు తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయం నుంచి పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని పోరంకిలో నిర్వహించిన టిడిపి సమావేశానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ, ఎంపీపీ

జిల్లెల్లగూడెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

పోలవరం: ఇంతకు ముందు ప్రభుత్వంలో ప్రజలకు ఏదైనా సమస్య వస్తే రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పరిస్థితి లేదని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని జిల్లెల్లగూడెం పంచాయతీలో 'గడపగడపకు మన ప్రభుత్వం' ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోయినాగుపాలెం, రెడ్డి నాగంపాలెం, మనుగోపుల, పేద్రాల గ్రామాల్లో గడపగడపకు తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇంతకు ముందు ప్రభుత్వంలో ప్రజలకు ఏదైనా సమస్య వస్తే రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థను పెట్టి ప్రజల అవసరాలను తీర్చే విధంగా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, సర్పంచి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15న అగ్రిగోల్డ్ బాధితుల ర్యాలీ

కలిదిండి: అగ్రిగోల్డ్ బాధితుల డిపాజిట్ సొమ్ములను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని కైకలూరు నియోజకవర్గ అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చక్కా జగన్మోహనరావు తెలిపారు. కలిదిండిలో అగ్రిగోల్డ్ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈనెల 15వ తేదీన విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బాధితుల సొమ్ము చెల్లిస్తామని చెప్పిన సిఎం జగన్ మాట తప్పారన్నారు. 'ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా' అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. లక్షలాది అగ్రిగోల్డ్ బాధితుల సొమ్ము చెల్లించే వరకు పోరాడేందుకు బాధితులు విజయవాడ తరలిరావాలని కోరారు. ర్యాలీ అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ అసోషియేషన్ సభ్యులు అలజింగి వెంకట రాంబాబు, వాయుగుండ్ల రామకృష్ణ, పచ్చిగొళ్ల లలితా ప్రసాద్, వి.రాంబాబు, మామిడి సత్యన్నారాయణ, నేతి నరసింహ మూర్తి పాల్గొన్నారు.

వికలాంగులకు రాయితీపై ఉచిత బస్‌పాస్‌లు

జంగారెడ్డిగూడెం: వికలాంగులకు ఆర్‌టిసి రాయితీపై బస్‌పాస్‌లు అందిస్తున్నట్లు ఆర్‌టిసి డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. వికలాంగులకు సోషల్ సర్వీస్ సెంటర్ ఏలూరు వారిచే రాయితీతో కూడిన ఎపిఎస్ఆర్‌టిసి బస్ పాసులు ఉచితంగా అందించనున్నారని తెలిపారు. ఈ పాస్‌ల ద్వారా వికలాంగులు రాష్ట్రంలో ఎక్కడనుంచి ఎక్కడికైనా సగం ఛార్జితో మూడు సంవత్సరాల పాటు ప్రయాణం చేయవచ్చని తెలిపారు. అర్హత కలిగిన వికలాంగ అభ్యర్థులు, ఆధార్ కార్డ్, సదరన్ వికలాంగుల సర్టిఫికెట్, ఒక ఫోటో సమర్పించాలని సూచించారు. వీటిని దగ్గర లోని సచివాలయం ఆఫీసులో వెల్ఫేర్ అసిస్టెంట్‌కి ఈనెల 13వ తేదీ సాయంత్రం 5గంటల లోపు అందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన వికలాంగులు ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కె.కృష్ణారావు(ఆర్‌టిసి కండక్టర్) నెంబర్ 7981251034 కు సంప్రదించాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు వైపు నుంచి ఏలూరు ప్రధాన రహదారిపై కోళ్ల వ్యర్థ పదార్థాలతో వెళుతున్న లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు శనివారం రాత్రి సమయంలో ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామం పరిధిలో ఆర్ అండ్ బి రహదారిపై ముసునూరు పోలీస్ స్టేషన్‌కి సంబంధించిన సిబ్బందికి కనిపించడంతో, ఆ లారీని డ్రైవర్ అతివేగంతో నడపడంతో గమనించిన పోలీసులు వెంటాడి పట్టుకుని నిలదీశారు. అతనిని వివరాలు అడగగా హైదరాబాదు నుంచి కోళ్ల వ్యర్థ పదార్థాలను కైకలూరు ఏరియా శ్రీపరు గ్రామాల్లోని చేపల చెరువులకు తరలిస్తున్నట్లు తెలిపారు. లారీని అదుపులోకి తీసుకొని, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని ముక్కొల్లుపాడు గ్రామానికి చెందిన కోరు రమేష్ భార్య ప్రియాంక(26) కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మద్య డబ్బులు ఖర్చు పెట్టే విషయంలో భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. దీంతో ప్రియాంక ఇంట్లో ఉన్న పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్ : అప్పుల బాధ తాళలేక కూలీ పనులు చేసుకునే యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని తాపీ మేస్త్రి కాలనీకి చెందిన పసివేదల నాగసాయి యోగి ప్రసాద్(23) స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. సోమవారం అందరూ నిద్రిస్తున్న సమయంలో వంట గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాథమికంగా అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రెండో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రూ.69 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటా కుళాయిలు

మండవల్లి ప్రజల హర్షం

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లిలో జల జీవన్ మిషన్ ద్వారా ఉచితంగా కుళాయిలను ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టడం సంతోషదాయకమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో మంగళవారం మాట్లాడారు. మండవల్లిలో ఉచితంగా కుళాయిలను ఇచ్చేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.69 లక్షల నిధులు వచ్చాయన్నారు. నిధులు మంజూరై సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఉచితంగా పంపులు ఇచ్చే విధంగా అడుగు ముందుకు పడకపోగా, వ్యక్తిగత కుళాయిలను ఇచ్చేందుకు గ్రామస్తుల నుంచి డబ్బులను వసూలు చేసేందుకు గ్రామపంచాయతీ రంగం సిద్ధం చేసిందని తెలిపారు. గ్రామస్తుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత రావడంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించే విధంగా జలజీవన్ మిషన్ ద్వారా ఉచితంగా కుళాయిలను అందించాలని, పథకాలను సక్రమంగా నిర్వహించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సోమవారం నిర్వహించే స్పందనలో అర్జీ సమర్పించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ వివి కృష్ణారావు స్పందించారని అన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించి మండవల్లిలో ఉచిత కుళాయిలను ఇచ్చే విధంగా భీమవరంకు చెందిన అడ్డాల రామారావు ద్వారా టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేశామని ఆయన తెలిపారన్నారు. అంతేకాకుండా ఉచితంగా కుళాయిలు ఇచ్చే విధంగా జలజీవన్ మిషన్ ద్వారా మండవల్లికి రూ.69 లక్షలు, అగ్రహారానికి మరో రూ.9 లక్షలు మంజూరయ్యాయని కూడా తెలిపారన్నారు. ఈ నిధులతో ఐదు లక్షల లీటర్ల మైక్రో ఫిల్టర్ సిస్టంలు రెండు ఏర్పాటు చేయడంతో పాటు, రూ.13 లక్షలతో మూడున్నర కిలోమీటర్ల పొడవునా పైపులను నిర్మించి, ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయి కలెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన తాగునీరందించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. దీంతో ఏండ్ల తరబడి ఎదురుచూస్తున్న వ్యక్తిగత కుళాయి కనెక్షన్ కష్టాలు తీరనున్నాయన్నారు. మండవల్లి ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత కుళాయిల సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరితగతిన పనులు ప్రారంభించి, ఉచితంగా కుళాయిలనిచ్చి స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చూడాలని ఆయన అధికారులను కోరారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విజేతలకు 14, 15 తేదీల్లో నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజవర్గ ఆటల పోటీలకు రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మండల స్థాయి జట్టుకు ఎంపికైన ఆరుగురు విద్యార్థులు ఈనెల 14, 15వ తేదీలలో ముసునూరులో నిర్వహించే నూజివీడు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలలో పాల్గొననున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు ముసునూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో బాల, బాలికలకు మంగళవారం నిర్వహించారు. అండర్ 14, 17వ విభాగాలలో వాలీబాల్ ఆటలో రమణక్కపేట హైస్కూల్ విద్యార్థులు(బాలురు), వాలీబాల్ ఆటలో అండర్‌బి 17, ముసునూరు, గోపవరం, విద్యార్థులతో ఫైనల్ మ్యాచ్ వేల్పుచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో ఆడి విజేతగా నిలిచారు. మండల స్థాయి జట్టుకు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పివిఎస్ రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పంచాయతీ నుంచి నగర పంచాయతీగా, మున్సిపాలిటీగా మారి రెండున్నర సంవత్సరాలు దాటినా కనీసం వీధిదీపాలు కూడా వెలిగించలేని దుస్థితి నెలకొందని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్.సూర్యకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాలకమండలి లేని చింతలపూడి నగర పంచాయతీ అధికారుల ఆదేశాలతోటే నడుస్తుందన్నారు. అనేక వీధి దీపాలు సంవత్సరాలు తరబడి వెలగకుండా ఉన్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని, మున్సిపాలిటీ విద్యుత్ సిబ్బంది ఏ స్తంభంపై లైట్లు వెలగడం లేదో చూసి మార్చే పరిస్థితి లేదని ఆరోపణలు చేశారు. ఎవరైనా మున్సిపాలిటీ వద్దకు వెళ్లి గోడు చెప్పుకోడానికి కూడా అవకాశం లేకుండా ఉందన్నారు. అధికారుల మాటలు తప్ప కనీసం ప్రజల సౌకర్యం మెరుగుపరచాలని గాని, వీధిలైట్లు వెలిగించి రాత్రులు పట్టణ ప్రజానీకానికి కనీస సౌకర్యాలు కల్పిద్దామని కమిషనర్‌కి గాని, సిబ్బందికి గాని లేకపోవడం గమనార్హమని తెలిపారు. చింతలపూడి ప్రజానీకానికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, రాత్రులు ప్రమాదాలు జరగకుండా వీధిలైట్లు అన్నీ వెలిగేటట్లు చూడాలని కోరారు.

ప్రభుత్వం ప్రశ్నించే తత్వాన్ని అణచివేస్తుంది

చంద్రబాబు అరెస్టుకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - నిడమర్రు

జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజలు, కార్మికుల హక్కులు హరిస్తూ, ప్రశ్నించే తత్వాన్ని అణచివేస్తుందని సిపిఎం మండల కార్యదర్శి నారపల్లి రమణారావు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడాన్ని, జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ నాయకుల్ని ప్రశ్నించకుండా గృహనిర్బంధించడాన్ని నిడమర్రు సిపిఎం మండల కమిటీ ఖండించింది. నిడమర్రు సిపిఎం మండల సానుభూతిపరుల సమావేశం మంగళవారం ప్రజాసంఘాల కార్యాలయంలో వెలగలేటి మోహన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నారపల్లి రమణారావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు, కార్మికుల హక్కులను, స్వేచ్ఛను పూర్తిగా హరిస్తున్నారన్నారు. ప్రశ్నించే తత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం తట్టుకోలేక అణచివేసే ధోరణి మానుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కమిలి నాని, తోపు శ్రీను, చంద్రరావు పాల్గొన్నారు.

మద్ది ఆలయంలో వెయ్యి మందికి అన్నదానం

ఒక్క రోజు ఆదాయం రూ.1,10,775

ప్రజాశక్తి - జంగారెడ్డి గూడెం

మండలంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చిన యాత్రికులు వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఈ క్రమంలో అన్నదాన విరాళాలు, ప్రసాద పూజా టిక్కెట్ల అమ్మకాలు, ఇతర సేవల ద్వారా ఒక్క రోజు ఆదాయం రూ.లక్షా 10 వేల 775 సమకూరిందని తెలిపారు. ఆలయానికి వచ్చిన యాత్రికులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది, ఆలయ ధర్మకర్తలు సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దండు వెంకట కృష్ణంరాజు, కర్పూరం రవి, పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు సరిత విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమల నిత్య అన్నదానం ట్రస్ట్‌కు గుంటూరు జిల్లా మంగళగిరి జిల్లా వాస్తవ్యులు రియాన్స్ సాయిరాం మంగళవారం ఉదయం రూ.1,00,116లు విరాళంను దేవస్థానం ఎఇఒ మెట్టపల్లి దుర్గారావుకు అందజేశారు. అనంతరము దాత కుటుంబ సభ్యులు స్వామి వారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్ అందించారు.

తహశీల్దార్‌కు వినతిని అందిస్తున్న సంతోష్

స్కూటీ ఇప్పించాలని వినతి

చాట్రాయి: వికలాంగులు నడిపే స్కూటీని ఇప్పించి ఉన్నత విద్యాకు సహకరించాలని మండలంలోని మంకొల్లు గ్రామానికి చెందిన వికలాంగుడైన తనగాల సంతోష్ మంగళవారం తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావుకు వినతిని సమర్పించారు. పుట్టుకతోనే రెండు కాళ్ల పనిచేయని స్థితిలో వికలాంగత్వం కలిగి ఉన్నానని, ఐనా పట్టుదలతో పదో తరగతి చదివి పాస్ అయ్యానని తెలిపారు. ప్రస్తుతం చింతలపూడి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్‌మీడియట్ చదువుతున్నానీ, కాలేజీకి వెళ్లి రావటానికి చాలా ఇబ్బంది పడుతున్నానని తెలిపారు. వికలాంగులు నడిపే స్కూటీని ఇప్పించి ఉన్నత విద్యకు సహకరించాలని, నివాస స్థలానికి ఇళ్ల స్థలము కూడా మంజూరు చేయాలని కోరారు. తల్లిదండ్రులు చిన్నప్పుడే మరణించారని పోషణకు ప్రభుత్వ భూమిని కొంత మంజూరు చేయాలని కోరాడు. ఈ విషయమై నూజివీడు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా తహశీల్దార్‌కు మీ సమస్యను పరిష్కరించేలా చెబుతానని తెలిపారు.

పథకాల అమలులో లోపాలుంటే తెలపాలి

న్యాయ విజ్ఞాన సదస్సులో జి.రాజేశ్వరి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బాలల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని, వాటిని అమలు చేసే విధానంలో ఏమైనా లోపం ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సర్ సిఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో బాలల సంరక్షణ, న్యాయ సహాయము అంశముపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి మాట్లాడుతూ బాలలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పైన యాజమాన్యాలు అవగాహన కలిగించాలని తెలిపారు. అలాగే బాలలకు ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, లీగల్ సర్వీసెస్ వారు అందించే ఉచిత న్యాయ సహాయాలపైన అవగాహన కల్పించారు. బాలబాలికలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, సత్ప్రవర్తనతో తోటి వారితో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని, మంచి నడవడికతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ పి.వెంకటేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపల్ సాయికుమారి పాల్గొన్నారు.

అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న రాజేశ్వరి

గోనె సంచులు, వాహనాలు సిద్ధం చేసుకోవాలి

రైస్ మిల్లర్లకు, లారీ అసోసియేషన్ వారికి జెసి సూచనలు

ఏలూరు : రైస్ మిల్లర్లకు, లారీ అసోసియేషన్ వారికి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి మంగళవారం తగు సూచనలు చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ధాన్యం సేకరణ కమిటీ రెండో సమావేశంలో ఖరీఫ్ 2023-24నకు ముందస్తు చర్యలలో భాగంగా అవసరమైన గోనె సంచులను సమకూర్చుట, సేకరించిన ధాన్యమును రైస్ మిల్లులకు తరలించుటకు అవసరమైన వాహనములకు జిపిఎస్ పరికరాలను అమర్చుకోవలసిందిగా తెలిపారు. ట్రాక్టర్ అసోసియేషన్ వారిని కూడా సంప్రదించి ట్రాక్టర్‌లో కూడా జిపిఎస్ పరికరాలను అమర్చుకొనుటకు ఒప్పించాల్సిందిగా తెలిపారు. రైస్ మిల్లర్ల వద్ద ఉన్న 225 లారీలను, లారీ అసోసియేషన్ వద్ద ఉన్న 250 లారీలను ధాన్యం రవాణాకు అందుబాటులో ఉంచుటకు సంసిద్ధతను వ్యక్తపరిచారు. సంయుక్త కలెక్టర్ సీజన్‌లో రోజుకు సుమారు 500ల వాహనాలను అందుబాటులో ఉంచాల్సిందిగా వాటికి తగు జిపిఎస్ పరికరాలను ముందుగానే అమర్చి ధాన్యం సేకరణ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని సిద్ధంగా ఉండవల్సిందిగా సూచించారు. జిపిఎస్ పరికరాలను, రవాణా వాహనాలకు అమర్చుట తప్పనిసరి అని, అట్టి వాహనములను మాత్రమే ధాన్యం సేకరణకు అనుమతించబడునని తెలిపారు. వాహనములు రిజిస్ట్రేషన్ చేయించుకొని, రైతు భోరోసా కేంద్రంతో ఎంఒయు చేసుకొన్న వారం రోజుల్లో సదరు రైతుకు గాని, కాంట్రాక్టర్‌కి గాని రవాణా ఛార్జీలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఎటువంటి అంతరాయం లేకుండా ధాన్యం సేకరణ, రవాణా చేయవలసిందిగా ఆదేశించారు.

అర్హులందరికీ నూతన పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

అర్హులైన లబ్ధిదారులందరికీ ఫించను అందిస్తున్నామని చింతలపూడి గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలిప్ తెలిపారు. చింతలపూడి పట్టణంలోని బోయగూడెం సచివాలయంలో నూతన ఫించనులను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నిరంతరం కష్టపడుతున్నారని, పేదలకు సంక్షేమ పథకాలు అందించటమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరి రాజా, వైసిపి నాయకులు గోపి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మండవల్లి : మండలానికి 232 కొత్త ఫించన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ వెంకటరమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాత, అవ్వలు, వితంతువులు, వికలాంగులను ఆదుకునే విధంగా క్రమం తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫించను అందిస్తుందన్నారు. అయితే కొత్తగా అయ్యవారి రుద్రవరం 12, భైరవపట్నం 10, చెంతపాడు 18, గన్నవరం 3, ఇంగిలంపాక లంక 19, కానుకొల్లు 12, కొవ్వాడ లంక 15, లింగాల 9, లోకుమిడి 16, మండవల్లి 14, పెనుమాక లంక 21, పెరికె గూడెం 19, పులపర్రు 14, పుట్లచెరువు 18, తక్కిలిపాడు 15, ఉనికిని 17 మొత్తం 232 నూతన ఫించన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇప్పటికే 6,856 మంది ఫించను దారులకు రూ.కోటీ 87 లక్షల 22 వేల 750 రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుండగా, నూతనంగా మరో 232 మంది అర్హులైన వారిని గుర్తించి రూ.6 లక్షల 46 వేల 509 అదనంగా అందిస్తుందన్నారు. మొత్తం మండవల్లి మండలంలో 7,088 ఫించను దారులకు రూ.కోటీ 93 లక్షల 68 వేల 250 లబ్ధి చేకూరుతుందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫించన్‌ను సద్వినియోగం చేసుకుని, లబ్ధి పొందాలని ఆయన కోరారు.

చింతలపూడిలో ఫించను అందజేస్తున్న గ్రంథాలయ ఛైర్మన్

ఏలూరు టౌన్ : మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు ఎంఎల్ఎ ఆళ్ల నాని చొరవతో ఏలూరు నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం రెండవ విడత 846 కొత్త పింఛన్లు మంజూరు అయినట్లు ఎంఎల్ఎ కార్యాలయం ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే ఈనెల మొదటిన మొదటి విడత 812 కొత్త పింఛన్లు అందజేశామన్నారు. వెరసి మొత్తం ఈ ఒక్క నెలలోనే 1,658 పింఛన్లు మంజూరు చేసినట్టు వివరించింది. అర్హులైన ఏ ఒక్కరు మిగిలిపోకూడదననే ఉద్దేశంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటి విడతలో పింఛన్లు మంజూరు చేయగా మిగిలిన దరఖాస్తులను కూడా పరిశీలించి అర్హులైన వారందరికీ రెండవ విడతలో పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈనెల 14 వరకూ పింఛన్ల పంపిణీ గడువుని పొడిగించినట్టు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1766/2022
Between:
Kalidindi Venkata Rama Krishna Raju ...Plaintiff
And:
Kaki Appa Rao & another ...Defendants
SUMMONS
To,
D-1: Kaki Appa Rao, S/o.Sankarayya, Hindu, aged 40 years, R/at D.No.1-6, Pulaparthi Post, Yellamanchili Mandal, Visakha District Presently R/at C/o. Gangisetty Suryanarayana, Desalamma Temple, 2nd lane, Chintal Thota, Palakollu, W.G. District.
D-2: Kaki Venkata Saraswathi, W/o.Kaki Appa Rao, Hindu, aged 35 years, R/at D.No.1-6, Pulaparthi Post, Yellamanchili Mandal, Visakha District
Please take notice that the above named plaintiff has instituted the above suit against both of you for recovery of an amount of Rs.2,56,000/- and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to 27-09-2022 for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on 27-09-2022 at 10:30 A.M in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.
S.S. REDDY & D.S. RAMA RAJU
Advocates
Visakhapatnam

In The Court Of The Principal Senior Civil Judge :: Eluru
F.D.I.A.No. 233/2021
O.S.No. 229/2017
Between:
Maddula Lakshmi Kumari ...Petitioner /Plaintiff
AND
Matta Naga Praveen Kumar ...Respondent /Defendant
Respondent /Respondent:
Matta Naga Praveen Kumar, S/o. Rambabu, Hindu, Male, Age 36 Yrs, R/o. Vijayarai (V), Pedavegi (M), Eluru District.
పై నెంబరు నందు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున ది.25-09-2023న ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ ప్లీడరు గారు గాని హాజరు కావలెను. లేని ఎడల పరోక్షముగా తీర్మానించబడును.
కె.వి.ఆర్.కె.సుబ్బారావు
అడ్వకేట్, ఏలూరు.
సెల్:93917 66444

నోటీసు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ప॥గో॥జిల్లా Cum మోటార్ ఏక్సిడెంట్స్ క్లయిమ్ ట్రిబ్యునల్, ఏలూరు వారి కోర్టులో
M.V.O.P. 49/2023
Between:
గెడ్డం నాగరాజు -పిటీషనరు
AND
జి.ఎన్.వి.ప్రసాద్, వగైరా -రెస్పాండెంట్లు
పై నంబరు పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన వెలిగట్ల శ్రీనివాసరావు, S/o. మసలయ్య, డో.నెం. 3-321-12, దుర్గా ఇండేన్ గ్యాస్ గొడౌన్ వద్ద, పాలంగి గ్రామం, ఉండ్రాజవరం మండలం, ప॥గో॥జిల్లా అనువారికి నోటీసులు అమలు కొరకు ది. 15-9-2023వ తేదీకి వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమందు పిటీషను సంగతులు తీర్మానించెదరు.
తోట వీర వెంకట సత్యనారాయణస్వామి
న్యాయవాది
ఏలూరు నరశింహారావుపేట (ఆఫీసు)
12-9-23 ఏలూరు, సెల్:9848232765

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, తణుకు
O.S. 533/2019
Between:
Plaintiff: State Bank of India, Main Branch, Tadepalligudem
Defendant: Katta Padmavathi
To:
Katta Padmavathi, D/o. Venkateswara Rao, Door No. 44-34, Relangi Village, Iragavaram Mandalam, TNK JCJC.
పై నెంబరు దావాలో ప్రతివాదికి ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను సదరు దావా సంగతులు తెలిసియుండి సదరు సమన్లు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు యిచ్చి ది. 22-09-2023 కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
PASUPULETI SRINIVAS
Tadepalligudem Advocate for Plaintiff
Date: 30-08-2023 Tadepalligudem

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తణుకు
O.S. No. 169/2008
Between:
వాది: షేక్ పీర్‌భాషా
మరియు
ప్రతివాదులు: శీలబోయిన వెంకటేశ్వరరావు మరియు వగైరా
8వ ప్రతివాది: వెన్నాడ వెంకటలక్ష్మి, W/o. అంబికా ప్రకాష్, దంతుపల్లి, అత్తిలి మండలం.
పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు వారు పలుమార్లు మీయొక్క Appearance నిమిత్తం సమన్లు ఆర్డరు వేసినప్పటికీ మీరు తీసుకొనక కాలయాపన చేసినందున మీ యొక్క Appearance నిమిత్తం ది. 14-09-2023 ఉదయం 10 గం॥ 30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కాని యెడల మీకు పరోక్షము గావింపబడుదునని మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
N.V.S.S.P.RAMA MOHAN
N.V.S.RAMNUJUM
తణుకు Advocates, Tanuku
ది.11-9-2023 Cell: 9848368653